# సర్పయాగం

### వీరపల్లె వీణావాణి

కాలం పగటి నేత్రాన్ని విప్పుతోంది.

మంటలతో తగలబడి పోతున్నట్టుగా తూర్పు ఆకాశం ఎర్రదనాన్ని సంతరించుకుంటోంది. సృష్టి... రాత్రి తాలూకూ బద్ధకాన్ని విదిలించుకుంటోంది. పర్వతాల ముఖాలను మేలి ముసుగులా కప్పేసిన మంచు తెరలు తొలగి పోతున్నాయి.

శూన్యంలోకి ఎవరో ఎగుర వేసిన పేద్ద రక్త చందనపు ముద్దలా... తూర్పు ఆకాశపు నుదుటి సింధూరంలా... ఎర్రగా నిగనిగ లాడుతూ కొండలచాటు నుండి మెలమెల్లగా పై పైకి వస్తోంది ప్రాతః కాలపు సూర్యగోళం.

పొద్దు పొడిచి ఎంతోసేపు అవుతున్నా... యింకా యానాది వెంకట్రాముడు నిద్రలేవ లేదు. అంత అర్జంటుగా నిద్రలేచి వెంకట్రాముడు వెలగబెట్టవలసిన రాచకార్యాలు కూడా ఏవీ లేవు.

"సద్దేల (చద్ది అన్నం తినేవేళ) అవతా వుంటే యింగా యేం నిద్రది? లెగు లెగు. ఇయ్యాల తురకపల్లి తిరణాలకి పోవాలని అను కొంటివి గదా. ఆ సంగతి మర్సి నట్టుండావు"— అంటూ వెంకట్రాముడి భార్య నాంచారి అతడు కప్పుకున్న అతుకుల దుప్పటిని బలవంతంగా లాగి పారేసింది.

"నీ యబ్బయేలా! నీతో పెద్ద సావై పోయిందే. నన్ను కొంచెం నిద్దరబోనీయ్. రాత్రి తెల్లవారులూ ముండనాయాలి సీటీగల్తో (దోమలతో) కంటి మింద రెప్పెయ్యలా"— అంటూ వెంకట్రాముడు భార్యను విసుక్కుంటూ మరో వేపు తిరిగి పడుకున్నాడు. కానీ... అతనికి నిద్ర పట్టడం లేదు.

కారణం... ఆ సాయంత్రం తురకపల్లి తిరణాలకు పోవాలనే ఆలోచన అతనిని నిద్రకు దూరం చేసింది. ఆ తురకపల్లి తిరణాలకూ యానాది వెంకట్రాముడికీ చాలా అనుబంధ ముంది. అతనికి పంచ ప్రాణాలైన నాంచారిని రెండేళ్ళ క్రితం ఆ తురకపల్లి తిరణాలలోనే అతడు దక్కించుకోగలిగాడు.

తురకపల్లిలో ప్రతి ఏడాదీ చాలా పెద్ద ఎత్తున తిరణాల జరుగుతుంది. ఆ తిరణాలను చూడ్డానికి చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వేల సంఖ్యలో జనం వస్తుంటారు. తిరణాల జరిగే స్థలంలో వెడల్పయిన ఒక రాతి బండ వుంది. ఆ బండను అందరూ 'తిర్నాల బండ' అని వ్యవహరిస్తారు.

యానాది తెగలో వైవాహిక వ్యవస్థకు సంబంధించిన కట్టు బాట్లు పెద్దగా వుండవు. ఒక ఇల్లాలికి తన భర్త పట్ల అయిష్టత వుంటే... ఆ ఇల్లాలు అతనిని వదిలేసి తన కిష్టమైన మరో మగాడితో వెళ్ళిపోవచ్చు. మగాడు కూడా తన కిష్టం లేని భార్యని వదిలేసి మరో స్త్రీని భార్యగా స్వీకరించ వచ్చు.

తురకపల్లి పరిసర ప్రాంతాలలో జీవిస్తున్న యానాది తెగ మనుషులలో ఒక విచిత్రమైన ఆచారముంది. అది ఏమిటంటే... తమకు యిష్టంలేని భార్యలను లేదా భర్తలను వాళ్ళు ఆ తురకపల్లి తిరణాలకు తీసుకొచ్చి వదిలెయ్యవచ్చు. అక్కడ ప్రతి తిరణాలకూ ఎన్నో యానాది జంటలు విడిపోతుంటాయి. ఎన్నో కొత్త జంటలు కలుస్తుంటాయి.

Nani



ఆ విధంగా భర్తలను వదిలేసిన యానాది స్త్రీలూ, భర్తలచే వదిలెయ్యబడిన యానాది స్త్రీలూ కలిసి గుంపుగా అక్కడున్న తిర్నాల బండ మీద కూర్చుంటారు. తిరణాల రోజు ఆ బండపై కూర్చుంటే... తాము మరో మగాడితో వెళ్ళి కాపురం చేయడానికి సిద్ధంగా వున్నామని అర్థం.

తురకపల్లి తిరణాల రోజు యానాది మగాళ్ళు తిర్నాల బండ చుట్టూ నిలబడి ఆ బండపై కూర్చున్న తమజాతి స్త్రీలను గుచ్చి గుచ్చి చూస్తుంటారు. ఆ ఆడ గుంపులో తనకు నచ్చిన స్త్రీని ఎన్నిక చేసుకుని... ఆమె కిష్టమైతే యానాది మగాడు ఆమెను భార్యగా స్వీకరించి తనతో తీసుకెళ్ళి పోతాడు.

అయితే వాళ్ళ గత చరిత్రను గురించి పరస్పరం బొత్తిగా పట్టించుకోరు. తమతో కాపురం చేసినన్నాళ్ళు నీతిగా వుంటే అంతే చాలు వాళ్ళకు. యానాది వెంకట్రాముడు రెండేళ్ళ క్రితం ఆ తిర్నాల బండ దగ్గరే నాంచారిని యిష్టపడి భార్యగా స్వీకరించి, తనతో తీసుకొచ్చి సంసారం చేస్తున్నాడు.

నాంచారికి వెంకట్రాముడు మూడో భర్త. ఆమె గతంలో యిద్దరు మగాళ్ళతో కాపురం చేసి తురకపల్లి తిరణాలలో వదిలేసింది. వెంకట్రాముడికి కూడా నాంచారి మూడో భార్య. గతంలో ఒక భార్యను అతడే వదిలేశాడు. మరో భార్య అతడిని వదిలేసి మరొకడితో వెళ్ళి పోయింది.

అయితే... ఏ ముహూర్తంలో వెంకట్రాముడూ నాంచారీ ఒక్కటయ్యారో గానీ... వారు ఒకరికొకరు ప్రాణమై పోయారు. జీవితాంతం ఒకటిగానే కలిసి జీవించాలని నిశ్చయించుకున్నారు.

అగ్రహారం గ్రామానికి మకుటం లేని మహారాజు నాగరాజుగారు. రాజకీయనాయకులంతా అతన్ని 'రాజుగారు' అని పిలుస్తారు. అగ్రహార గ్రామస్థులు అతన్ని 'పెదకాపు' అంటారు. వెనుకబడిన జాతులవారు మాత్రం 'సామి' అని పిలుస్తారు. కానీ ఎవరెలా పిలిచినా నాగరాజుగారు మాత్రం ఎవరితోనూ ఎక్కువ మాట్లాడరు. గాంభీర్యం వారికి పెట్టని భూషణం.

నాగరాజుగారికి బోలెడంత ఆస్థి వుంది. డబ్బుంది. పై వర్గాలలో పలుకుబడి వుంది. ఆయన ఒంట్లో వేడి వుంది. ఊళ్ళో ఆడవాళ్ళున్నారు. తన భార్య తప్ప ఆయన కళ్ళకి పరాయి ఆడ వాళ్ళంతా అందంగానే కన్పిస్తారు. నాగరాజు

## ఉత్తర అమెరికా తెలుగు సభలకి 'బాపు'



సుప్రసిద్ధ దర్శకులు, చిత్రకారుడు శ్రీ బాపు జూన్ 24న బయలుదేరి లండన్ వెళ్ళారు. లండన్‌లో 4 రోజులు గడిపి ఉత్తర అమెరికాలో జూలై మొదటి వారంలో జరగనున్న తెలుగు సభలలో బాపు పాల్గొంటారు. ఆయన దర్శకత్వం వహించిన "త్యాగయ్య" ఇండియా ఫెస్టివల్ సందర్భంగా అమెరికాలో ప్రదర్శిస్తారు. అమెరికాలో బాపు బొమ్మల ప్రదర్శన, బాపు చిత్ర ప్రదర్శనలు నిర్వహిస్తారు.

గారికి రెండు బలమైన విషకోరలు కూడా వున్నాయి.


అయితే అవి ఎవరికీ అగుపించవు. ఆ కోరలు ఆడవాళ్ళ శీలాన్ని నిర్విఘ్నంగా కాటేస్తుంటాయి. ఆ కోరల్ని పీకేసే గుండె ధైర్యం ఆ ఊళ్ళో ఎవరికీ లేవు. నాగరాజుగారిని గానీ చూస్తే ఆ అగ్రహారం లోని కొందరాడవాళ్ళు నాగుపామును చూసినట్లుగా జడుసుకుని పరుగెడుతారు.

నాగరాజుగారికి నలభై ఎకరాల మామిడితోట కూడా వుంది. అది ఊరికి తూర్పుగా ఓ కిలోమీటరు దూరంలో వుంది. ఆ మామిడి తోటలో గుడిసె వేసుకుని యానాది వెంకట్రాముడు కాపురముంటున్నాడు. ఆ తోటకతడు అంగరక్షకుడు. తోట చుట్టూ ఆరడుగుల ఎత్తు ముళ్ళకంచె వుంది.

యానాది వెంకట్రాముడి వృత్తి నాగు పాముల్ని పట్టడం... వాటి చర్మం తీసి సంతలో అమ్ముకోవడం. తన తోటకు కావలి కాస్తున్నందుకు నాగరాజుగారు వెంకట్రాముడికి తిండికి లోటు రాకుండా గింజలు యిస్తుంటాడు. పై ఖర్చులకోసం అతడు నాగుపాములు వేటాడుతుంటాడు.

విశాలమైన ఆ మామిడి తోటలో వున్న నాగు పాములలో ముప్పాతిక భాగం వెంకట్రాముడి చేతిలో పట్టుబడి ప్రాణాలను పోగొట్టుకున్నాయి. ఆ పరిసర ప్రాంతాలలో వుండే పాముల దృష్టిలో వెంకట్రాముడు యమకింకరుడు. అందుకే అతన్ని చూస్తే నాగుపాములు భయంతో పరుగెడుతాయి.

పాము తన కంట పడితే... పాతిక రూపాయలు కంటబడినంతగా సంబర పడిపోతాడు వెంకట్రాముడు. తన కంట పడిన నాగుపామును సాధారణంగా అతడు తప్పించుకోనివ్వడు. వెంకట్రాముడి కంట పడితే.. యిక ఆ పాముకు ఆయుష్షు తీరినట్టే. అతని సర్పయాగానికి అంతులేదు.




అంతవరకు పడుకునివున్న వెంకట్రాముడు కళ్ళు నులుముకుంటూ పైకి లేచి నిలబడి ఒళ్ళు ఒక్కసారిగా విరుచుకున్నాడు. వెంటనే పాక లోంచి వెలుపలికొచ్చి ఎదురుగా వున్న వేపచెట్టు దగ్గరకు వెళ్ళి పుల్ల విరుచుకుని గబగబా పళ్ళు తోముకున్నాడు. మట్టిబానలో వున్న నీళ్ళతో ముఖం కడుక్కుని సద్దినీళ్ళు పొయ్యమని భార్యనడిగాడు.

"యాంటా ఆత్రం? రొంచేపు (కొంత సేపు) వుండు. వూరిబిండి (పచ్చడి) నూరతా వుండా"— అంది నాంచారి.

"రొంచేపుంటే పొద్దెక్కిపోతాది. నేను మల్లా మద్దేనంకల్లా తిరుక్కొనొచ్చేయాల. బిన్నే (తొందరగా) వూరిబిండినూరు మరి"— అన్నాడు వెంకట్రాముడు.

"యాడికో (ఎక్కడికో) పయానం?"— అడిగింది నాంచారి వెంకట్రాముడి వేపు చూస్తూ.

"పాముల కోసం పోతావుండా. ఈ పొద్దు వొగిటైనా కనిపిస్తాదో లేదో. ఒక పామన్నా దొరికితే బాగున్ను. తోలుదీసి సంతలో అమ్మొసి రావచ్చు. తురకపల్లి తిర్నాలలో సీర తీసియ్యమని అడిగితివి. సేతిలో దుడ్డు (డబ్బు) లేకపోయె. పాము దొరికితేనే... నీకు తిర్నాలలో సీరకొనిచ్చేది"

"సంబరం సాలుగానీ... నువ్వు పాముల కోసమెల్లి మాయిటేల (సాయంత్రం వేళ) దాకా రాకుండా వుండేవు. పాము దొరికినా దొరక్కపోయినా మద్దేనం యాలకొచ్చేయ్. పొద్దుగూకకముందే తిర్నాలకు పోదాం"— అంటూ నాంచారి కంచంలో సంకటి ముద్ద పెట్టి పచ్చడి వేసి భర్త ముందు పెట్టింది.

వెంకట్రాముడు పది నిముషాల్లో తినడం పూర్తి చేసి 'బ్రేవ్' అని త్రేన్చుతూ పాకలోంచి వెలుపలికొచ్చి తిన్నెపై చతికిల బడి బీడీ వెలిగించాడు. అంతలో అక్కడో కోడి తన పిల్లలతో తిరుగుతుండడం అతనికి కన్పించింది. పిల్లల్ని లెక్కించాడు వెంకట్రాముడు. ఒక పిల్ల తక్కువగా వుంది.

"వొక కోడి పిల్ల కనిపించలేదే. యిట్లొచ్చి చూడు"— అని వెంకట్రాముడు కేక వెయ్యగానే నాంచారి గబగబా వెలుపలికొచ్చి కోడి పిల్లల్ని లెక్కపెట్టింది. ఓ పిల్ల కన్పించడంలేదు. అవి చాలా చిన్న చిన్న పిల్లలు.

"నాకు తెల్సు. ఆ వుప్పిలి పొదల్లో తిరగాడే ఆ దొంగ సచ్చిన నాగుపామే కోడిపిల్లను మింగేసుంటుంది. ఈ వుంపడం (బుద్ధిలేని) కోడి యెప్పుడూ ఆ వుప్పిలి పొదల కాడికే పిల్లల్ని తీసకపోతాది"— అంటూ నాంచారి ఆ తల్లి కోడిని కోపంగా తిట్టడం మొదలెట్టింది.

"ఆ వుప్పిలి పొదల్లో వుండే నాగుపాము శానా పెద్దది. పురుగూ పుట్రా తిని దున్నపోతు మాదిరిగా బలిసిపోయింది. తోలుగానీ తీసి సంతలో అమ్మితే దుడ్డు మొస్తుగా (పుష్కలంగా) వస్తాది. ఆ పాము నా కంట్లో పడి రొండు సార్లు తప్పించుకునింది. నాయాల్ది దొరక్కపోతాదా?"— అన్నాడు వెంకట్రాముడు.

ఆరిపోయిన బీడీని అవతల పారేసి, పాకలోకి వెళ్ళి పలుగూ కత్తీ అందుకుని బయలు దేరాడు వెంకట్రాముడు. తనకో చీర కొనివ్వమని నాంచారి అతన్ని చాలా రోజుల నుండి అడుగుతోంది. తురకపల్లి తిరణాలలో తప్పకుండా ఈసారి చీర కొనిస్తానని చెప్పాడు వెంకట్రాముడు.

చీర కొనాలంటే తన దగ్గరున్న డబ్బు సరిపోదు. అంత డబ్బు కావాలంటే... అతడికి మరోపాము దొరకాలి. అందుకే పట్టుదలగా పాములకోసం ఆ విశాలమైన మామిడి తోటలో వెదక సాగాడు వెంకట్రాముడు. తిరగగా తిరగగా చివరకో నాగుపాము దొరికింద తనికి.

నానా యాతన పడి పట్టుకున్న ఆ పామును చూస్తుంటే అతని కెంతో సంతోషంగా వుంది. ఏదో గొప్పనిధి దొరికినంత సంబరంగా వుంది వెంకట్రాముడికి. ఆ పాముకున్న కోరల్ని పీకేసి... చంపకుండా పామును చేతికి చుట్టుకొని తన పాకవేపు హుషారుగా బయలు దేరాడు వెంకట్రాముడు.

పాక గడపలోకి అడుగెట్టిన వెంకట్రాముడు లోపలి దృశ్యం చూడగానే చటుక్కున నిలబడిపోయాడు. లోపల చేతుల్లో ముఖం దాచుకుని నాంచారి ఏడుస్తోంది. ఆమె రవిక తుంపర తుంపర్లుగా చిరిగి పోయివుంది. వెంట్రుకలు చెరిగిపోయి వున్నాయి. సుఖాస్వాదనలో అలిసిపోయిన కామందు నాగరాజుగారు విలాసంగా సిగరెట్ వెల్గించుకుంటున్నారు.

గట్టిగా ఏడుస్తూ భర్తను కౌగిలించుకుని జరిగిన దారుణం ఒక్క ముక్కలో చెప్పింది నాంచారి. ఆమె అలా చెప్పక ముందే ఆ సంగతిని గ్రహించగలిగాడు వెంకట్రాముడు. క్షణంలో అతడి పిడికిళ్ళు బిగుసుకున్నాయి. అతని ఒంట్లోని రక్తం సలసల కాగి ఆవిరై పోసాగింది. అతని కళ్ళు చింత నిప్పుల్లా మారాయి. అతనిలో ప్రతీకారం జీవనాడిగా పరిణమించింది.

హిరణ్యకశిపుడి ఉదరాన్ని చీల్చడానికై స్తంభం నుండి ఉద్భవించిన ఉగ్ర నరసింహుడిలా వున్న వెంకట్రాముడిని చూడగానే... జడుసుకుని ఆ పాక లోంచి చటుక్కున తప్పించుకుని దౌడు తీశాడు నాగరాజు. చేతిలో వున్న ఆ పామును దూరంగా పారేసి కత్తి పట్టుకుని వెంకట్రాముడు వేగంగా నాగరాజు వెంట పడ్డాడు.

భయంతో వణికి పోతూ... డేగచేత తరమబడే కోడిపిల్లలా... పులిచే వెంటాటబడే జింకలా... పగబట్టిన పామేదో తరుముతున్నట్టుగా గుండెలు అరచేత్తో పట్టుకుని పరు గెడుతూ... నాగరాజు. ఏనుగు కుంభ స్థలాన్ని చీల్చబోయే సింహంలా... మేక గొంతు కొరక బోయే తోడేలు లాగా... రౌద్రం మూర్తీభవించినట్టుగా... యానాది వెంకట్రాముడు.

"అమ్మా!"— సమస్త భూగోళం సంచలించి పోయేటట్టుగా నాగరాజు చావుకేక, గొడ్డలిచే చీల్చబడి... రెండడుగుల ఎత్తున్న ఎండిపోయిన ఒక చెట్టు మొదలు అక్కడుంది. అది చాలా వాడిగా గునపంలా వుంది. భయంతో పరుగెడుతున్న నాగరాజు దానిపై బోర్లా పడ్డాడు. అతని గుండెల్లో దూసుకు పోయిన ఆ చెట్టు మొదలు... అతని వీపుపై తేలింది. శూలానికి గుచ్చిన నిమ్మకాయలా వున్నాడు నాగరాజు.

పామునోట్లో యిరుక్కున్న మిడతలా... చర్మం తీసిపారేసిన నాగుపాములా... గాలానికి తగులుకున్న చేప పిల్లలా... విలవిలలాడి కన్ను మూశాడు నాగరాజు. "నాగుపామును సూసి అయ్యగోరు పరిగెడుతుంటే... కాలుజారి ఈ కొయ్యమింద పడిపోయారు పాపం" అంటూ నాగరాజు చావుకేక విని ఆ చుట్టుపక్కలనుంచి అక్కడికొచ్చిన వారితో చెప్పాడు వెంకట్రాముడు. అవాళ అతడూ నాంచారీ తురకపల్లి తిరణాలకెల్లారు. 'తిర్నాలబండ'పై నాంచారిని కూర్చో బెట్టాడు వెంకట్రాముడు.

*

## శేషేంద్రజాలం

చంపి కొండల్లో పారేశినవాడి శరీరం
రాగం కోసం బిగించిన ఫిడేలులా ఉంది
వాడి నోరు పాడిన పాటలు
ప్రవహించే నదులు ఆగి ఆలకించేవి—
చావు లేని వాణ్ని చంపిన మూర్ఖులకు
తెలీదు
ఏ మృత్తిక పువ్వును మనిషికి
కానుకగా ఇచ్చిందో, అది
వాడి నిర్మాణంలో ఉందని......

*

ఎవడు ఏడవగలడు మరొకడి కోసం
అంతశక్తి ఎవడికుంది
నీకోసం ఏడ్చేవాడికి
నీవు ఋణగ్రస్తుడివి
మార్క్స్‌కు ఈ శతాబ్దపు
అన్నార్తులందరూ ఋణగ్రస్తులు

* * *

## II

అరే ఆ కోడికూత విను
ఉషస్సు తూర్పున బ్రద్దలు కొడుతున్న
శబ్దం అది!
అదృష్టాన్ని వాగ్దానం చేసే
దిండ్లలాంటి స్వప్నాల మీద తలమోపి
నిద్రిస్తున్న ఓ మానవుడా!
ఎగరెయ్ నీ కోరిక ఒక ఉగ్రజెండాగా
లోకమంతా లావాద్రవాల ఉప్పెనలో
మునిగిపోయేలా

*

ఆకాశం విశిరే పిడుగులకు
అడ్డం లేదు
నా వాక్యాలకు కాపలా లేదు
అరే అవి జూనుంచి తప్పించుకున్న
సింహాలు
మనుషుల మీదికి దూకే
భయంకర ఓనమాలు

* * *

— శేషేంద్ర